# Startup India International Summit

January 14, 2021

## స్టార్టప్ ఇండియా అంతర్జాతీయ సదస్సు

జనవరి 14, 2021

1. 'ప్రారంభ్' – స్టార్టప్ ఇండియా అంతర్జాతీయ సదస్సును పరిశ్రమలు మరియు అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) 2021 జనవరి 15-16 తేదీల మధ్య వర్చువల్ పద్ధతిలో నిర్వహిస్తోంది. దేశంలో నలుమూలలా ఎంట్రప్రెన్యూర్‌షిప్ స్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిన స్టార్టప్ ఇండియా కార్యక్రమం ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సదస్సును నిర్వహించనున్నారు. గౌరవనీయ వాణిజ్య మరియు పెట్టుబడుల శాఖ మంత్రి జనవరి 15న ఈ సదస్సును ప్రారంభించనున్నారు అలాగే జనవరి 16న గౌరవనీయ ప్రధాన మంత్రి ఈ సదస్సు గ్రాండ్ ప్లీనరీ (ముగింపు సెషన్)లో పాల్గొంటారు.

2. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉన్నత స్థాయి విధానకర్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, ఇన్వెస్టర్లు, స్టార్టప్‌లు అలాగే అన్ని పక్షాలనూ ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు 'ప్రారంభ్' దోహదం చేస్తుందని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న అత్యుత్తమ వ్యవస్థల నుంచి మంచి విధానాలపై చర్చించడంతో పాటు, భారత్‌లో నవకల్పనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఎంట్రప్రెన్యూర్‌షిప్ వ్యాప్తి, విస్తృతిని చాటిచెప్పే విధంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. భారత్‌లోని స్టార్టప్‌లకు పెట్టుబడులను అందించడంపై ప్రపంచం దృష్టిని కేంద్రీకరించేలా చేయడం, దేశీయంగా పెట్టుబడులను సమీకరించడం, మన స్టార్టప్‌లకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలను కల్పించడం మరియు విధానపరమైన నిబంధనలు పాటించేలా చేయడం ఈ సదస్సు ముఖ్యోద్దేశం.

3. సదస్సు తొలి రోజున బిమ్స్‌టెక్ (ద బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఆఫ్ మల్టీ-సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్) స్టార్టప్ కాంక్లేవ్ నిర్వహణకు కేటాయించారు. 2018 ఆగస్ట్‌లో జరిగిన 4వ బిమ్స్‌టెక్ సదస్సు సందర్భంగా గౌరవనీయ ప్రధాన మంత్రి చేసిన ప్రకటనకు అనుగుణంగా దీన్ని నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎంట్రప్రెన్యూర్‌ల మధ్య కనెక్టివిటీని పెంపొందించడం ఈ కంక్లేవ్ ముఖ్యోద్దేశం. బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్ మరియు శ్రీలంక దేశాలకు చెందిన మంత్రులు, సీనియర్ అధికారులతో పాటు థాయ్‌లాండ్ నేషనల్ ఇన్నోవేషన్ ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బిమ్స్‌టెక్ సెక్రటరీ జనరల్‌లు ఈ సదస్సులో పాల్గొనే విషయాన్ని ధ్రువీకరించారు.

4. రెండు రోజుల పాటు కొనసాగే ఈ సదస్సులో స్టార్టప్‌లు మరియు ఇతర పక్షాల ప్రాతినిధ్యంతో విభిన్న థీమ్‌లపై ప్యానెల్ చర్చలు జరగనున్నాయి. బిమ్స్‌టెక్ స్టార్టప్ కాంక్లేవ్‌లో, అత్యుత్తమ విధానాలను పంచుకోవడం, నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ వర్క్‌షాప్, బహుళపక్ష ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్‌లు మరియు సామాజిక నవకల్పనలను ప్రోత్సహించడం అనే థీమ్‌లపై మొత్తం ఏడు ప్యానెల్ చర్చలు జరగనున్నాయి. ఈ వర్చువల్ స్టార్టప్ ప్రదర్శనలో బిమ్స్‌టెక్ దేశాల నుంచి 100కు పైగా స్టార్టప్‌లు పాల్గొననున్నాయి. గ్రాండ్ ప్లీనరీ సెషన్‌లో గౌరవనీయ ప్రధాన మంత్రిని కలుసుకునే అవకాశం పొందనున్నాయి.

5. ఈ వర్చువల్ సదస్సు ప్రపంచవ్యాప్తంగా అలాగే భారత్ నుంచి 200 మందికి పైగా పేరొందిన వక్తలను ఒకే వేదికపైకి తీసుకురానుంది. తద్వారా శాస్త్ర-సాంకేతికత, నవకల్పన, అత్యుత్తమ విధానాలు మరియు కార్యక్రమాలపై చర్చలకు వీలు కల్పించనుంది. అలాగే ప్రభుత్వ మరియు అంతర్జాతీయ సంస్థలు తమ అభిప్రాయాలను పంచుకోవడానికి ఇంకా యువ భారతీయ ఎంట్రప్రెన్యూర్‌లు మేధోమథనం జరిపేందుకు, భారత్ మాత్రమే కాకుండా ప్రపంచం మొత్తం ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను పరిష్కరించే దిశగా వారిని ప్రోత్సహించేందుకు ఈ సదస్సు దోహదం చేయనుంది.

**న్యూఢిల్లీ**

**జనవరి 14, 2021**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA’s website and may be referred to as the official press release.